క్లుప్తంగా

సమస్యలు పరిష్కరించకపోతే సేవలు స్తంభింపజేస్తాం


ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు

నర్సీపట్నం: దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఏరియా ఆస్పత్రి పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు ఆస్పత్రి సూపరింటెండెంట్ ఎం.నీలవేణీ దేవికి మంగళవారం వినతిపత్రం అందజేశారు. వేతన బకాయిలు చెల్లించాలని, నెలలు తరబడి వేతనాలు చెల్లించకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఏడాదికి 25 రోజులు సెలవులు ఇవ్వాలని, మూడు షిఫ్టుల విధానం అమలు చేయాలని కోరారు. తమ డిమాండ్లను పరిష్కరించకపోతే శానిటేషన్, సెక్యూరిటీ సిబ్బంది సేవలను స్తంభింపజేస్తామన్నారు.

31 వరకూ క్రీడలపై అవగాహన కార్యక్రమాలు

నర్సీపట్నం: నేషనల్ స్పోర్ట్స్ డేను పురస్కరించుకుని ఈ నెల 31వ తేదీ వరకు అవేర్నెస్ కార్యక్రమాల నిర్వహణకు జిల్లా స్పోర్ట్స్ అథారిటీ శ్రీకారం చుట్టింది. స్థానిక మున్సిపల్ స్టేడియంలో స్పోర్ట్స్ స్టూడెంట్స్, వాలీబాల్, క్రికెట్, షటిల్ ఇతర క్రీడాకారులతో స్పోర్ట్స్ అథారిటీ కోచ్ అబ్బు ప్రతిజ్ఞ చేయించారు. వూషూ కోచ్ శేఖర్, ఎన్ఐఎస్ కోచ్ ప్రియాంక సీనియర్ బాక్సర్లు, స్పోర్ట్స్ అకాడమీ చైర్మన్ వెలగా నారాయణ పాల్గొని అందరితో ప్రతిజ్ఞ చేయించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 40 ఏళ్ల దాటిన టీచర్లు, 18 ఏళ్లు దాటిన కాలేజీ స్టూడెంట్స్‌కి చెస్, క్యారమ్స్, షటిల్, క్రికెట్, రన్నింగ్, వాలీబాల్ పోటీలు నిర్వహించారు.

మెనూ అమలులో నిర్లక్ష్యం వద్దు


మాట్లాడుతున్న ఎంఈవో -2 వరహాలబాబు

నాతవరం : పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం పథకం మెనూ అమలుతో పాటు విద్యను మరింత అభివృద్ధి చేసే దిశగా పనిచేయాలని ఎంఈవో -2 కామిరెడ్డి వరహాలబాబు అన్నారు. మండల కేంద్రంలో గల వెలుగు కార్యాలయంలో మంగళవారం కొత్తగా ఎన్నికైన విద్యా కమిటీ చైర్మన్లు, ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. విద్యాకమిటీ చైర్మన్లు, ప్రధానోపాధ్యాయులు సమష్టి కృషితో పాఠశాలల అభివృద్ధికి పనిచేయాలన్నారు. ప్రతి నెలా పాఠశాల కమిటీలు నిర్వహించాలన్నారు.

29న ఎం.కోడూరులో దుర్గాలమ్మ జాతర

మాడుగుల రూరల్: మండలంలో ఎం. కోడూరు గ్రామంలో గల దుర్గాలమ్మ అమ్మ వారి జాతర ఈ నెల 29 వ తేదీ గురువారం ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేసినట్టు ఆలయ కమిటీ వారు మంగళవారం తెలిపారు. ఈ మేరకు జాతర గోడపత్రికను మంగళవారం స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి వెన్నెలపాలెంలో విడుదల చేశారు. జాతర సందర్భంగా ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు, అభిషేకాలు, సాయంత్రం నుంచి నేల వేషాలు, బండ్ల వేషాలు, థింసా నృత్యాలు, కోబ్రా నృత్యాలు, కోలాటాలు, కాంతార శక్తి వేషాలతో పాటు రాత్రికి పాతాళభైరవి నాటకం నిర్వహిస్తున్నట్టు ఉత్సవ కమిటీ విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

ఘనంగా తలుపులమ్మ తల్లి పండగ

నాతవరం : మండలంలో తలుపులమ్మ తల్లి పండగను మంగళవారం భక్తులు ఘనంగా జరుపుకొన్నారు. పి.కె.గూడెం గ్రామంలో వెలసిన తలుపులమ్మ తల్లిని గ్రామదేవతగా గ్రామస్థులు కొలుస్తున్నారు. ఈ పండగను ప్రతి ఏటా ఆగస్టులో జరుపుకోవడం ఆనవాయితీ. ఈ ఏడాది పండగ సందర్భంగా అమ్మవారికి పసుపు కుంకమ చీర జాకెట్టు సమర్పించి భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు నిర్వాహకులు ఉచితంగా తీర్థప్రసాదాలు, తాగునీరు అందించారు. ఈ సందర్భంగా మహిళల కోలాటం, భజనలతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

పీజీ కోర్సుల్లో చేరేందుకు అడ్మిషన్లు ప్రారంభం

నర్సీపట్నం: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి పీజీ కోర్సుల్లో చేరేందుకు అడ్మిషన్లు జరుగుతున్నాయని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.రాజు తెలిపారు. ఎంకాం, ఎంఎస్సీ (కామర్స్, కెమిస్ట్రీ),ఎంఎస్సీ కంప్యూటర్ సైన్స్ కోర్సుల్లో అడ్మిషన్లు జరుగుతున్నాయని, విద్యార్థులు ఈ నెల 28వ తేదీ లోపు కళాశాలలో సంప్రదించాలని కోరారు.

ప్రత్యేక నిఘా అవసరం



వైద్య వృత్తిలో ఉండి ఎంతో మంది ప్రాణాలు కాపాడుతున్న వైద్యులు, వైద్య సిబ్బందికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రక్షణ కల్పించాలి. ప్రభుత్వ ఆసుపత్రుల్లో రాత్రి పూట పనిచేసే మహిళా వైద్యులు, సిబ్బందికి పోలీసులతో భద్రత కల్పించాలి. ఆసుపత్రుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి ప్రత్యేక నిఘా ఉంచాలి. కోల్‌కతా ఆస్పత్రి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చట్టాలు తీసుకురావాలి.

– పి.డి.ఎస్. కళావతి, స్టాఫ్ నర్స్, దేవరాపల్లి పీహెచ్‌సీ

ప్రాణదాతలకే రక్షణ లేదా?



ప్రజల ప్రాణాలను కాపాడే వైద్యులకు రక్షణ లేక పోవడం ఆందోళన కలిగిస్తుంది. కోల్‌కతాలో వైద్యురాలిపై హత్యాచార ఘటన అమానుషం. ఈ ఘటనలో దోషులను కఠినంగా శిక్షించాలి. ఆసుపత్రిలో మహిళా వైద్యులు, సిబ్బంది రాత్రి పూట విధులు నిర్వర్తించే సమయంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలి. గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ ఆసుపత్రులకు రాత్రి వేళ పోలీసులతో రక్షణ కల్పించాలి.

– బి.రవితేజ, వైద్యాధికారి, దేవరాపల్లి పీహెచ్‌సీ

యూపీ స్కూల్‌కు ఆన్‌లైన్ కష్టాలు

- అప్‌గ్రేడ్ అయినా ప్రాథమిక పాఠశాలగానే నమోదు
- 6,7,8 తరగతులకు అందని ప్రభుత్వ సదుపాయాలు
- 40 మంది గిరిజన విద్యార్థులకు ఇక్కట్లు
- 108 మంది విద్యార్థులకు ముగ్గురే ఉపాధ్యాయులు
- అధికారుల నిర్లక్ష్యంపై విమర్శలు


సరుగుడులో యూపీ స్కూల్ విద్యార్థులకు బోధిస్తున్న ఎలిమెంటరీ పాఠశాల ఉపాధ్యాయుడు

నాతవరం: విద్యాశాఖాధికారులు చేసిన తప్పిదాలకు గిరిజన విద్యార్థుల పాలిట శాపంగా మారింది. మండలంలో సరుగుడు గ్రామంలో గల యూపీ పాఠశాల ఆన్‌లైన్‌లో నమోదు కాకపోవడంతో విద్యార్థులు, ఇక్కడి ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. సరుగుడు గ్రామంలో 1960లో ప్రాథమిక పాఠశాల ఏర్పాటు చేశారు. ఈ పాఠశాలను 2002లో యూపీ స్కూల్‌గా అప్‌గ్రేడ్ చేశారు. 2022లో అప్పటి ప్రధానోపాధ్యాయుడు విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉందన్న కారణంగా యూపీ స్కూల్ అడ్మిషన్లు చేయకుండా వదిలేశారు. దీంతో ఈ ప్రాంతానికి చెందిన గిరిజన విద్యార్థులంతా ఇతర ప్రాంతాలకు వెళ్లి అక్కడ పాఠశాలల్లో చేరారు. అప్పటి హెచ్ఎం బదిలీ కాగా, ఆ స్థానంలో తిరుమలరావు 2023లో హెచ్ఎంగా వచ్చారు. రాజకీయాలకు అతీతంగా సరుగుడు సుందరకోట పంచాయతీలకు చెందిన సుమారుగా 16 గ్రామాల గిరిజనులు ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తితో కలిసి సరుగుడులో యూపీ స్కూల్ నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు అప్పటి ఎంఈవో తాడి ఆమృత్‌కుమార్ అదేశాల మేరకు హెచ్ఎం తిరుమలరావు 6,7,8 తరగతుల్లో సుమారుగా 40 మంది విద్యార్థులకు అడ్మిషన్లు తీసుకున్నారు. కానీ గత హెచ్ఎం చర్యల కారణంగా సరుగుడు పాఠశాల ప్రాథమిక పాఠశాలగా తప్ప యూపీ స్కూల్‌గా ఆన్‌లైన్ నమోదు కాలేదు. ఇప్పుడు సరుగుడులో 1 నుంచి 8వ తరగతి వరకు 108 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఆన్‌లైన్‌లో సరుగుడు పాఠశాలను ప్రాథమిక పాఠశాలగానే గుర్తించడంతో ప్రభుత్వం నుంచి పుస్తకాలు ఇతర సామాగ్రి ఎలిమెంటరీ పాఠశాల విద్యార్థులకు మాత్రమే వస్తున్నాయి. 6,7,8 తరగతి విద్యార్థులకు ప్రభుత్వం సదుపాయాలేవీ అందడం లేదు. ఎంఈవో ఆధ్వర్యంలో సీఆర్పీ పుస్తకాలు ఇతర సామాగ్రి సర్దుబాటు చేస్తున్నారు. నేటికీ యూపీ స్కూలు విద్యార్థులకు బ్యాగ్‌లతో పాటు ఇతర సామగ్రి అందలేదు.

ప్రాథమిక ఉపాధ్యాయులతో బోధన

ఈ పాఠశాలలో మొత్తం 8 మంది ఉపాధ్యాయులు శాంక్షన్ ఉండగా యూపీ స్కూల్ ఆన్‌లైన్‌లో లేకపోవడంతో ముగ్గురు ఉపాధ్యాయులే ఉన్నారు. ఈ ఏడాది జూన్‌లో కొత్తగా చేరిన ఒక ఉపాధ్యాయురాలు వివిధ కారణాలతో సెలవుపై వెళ్లిపోయారు. యూపీ స్కూల్లో చదువుతున్న 108 మంది విద్యార్థులకు ప్రాథమిక పాఠశాల ఉపాధాయులే బోధిస్తున్నారు.

అధికారుల దృష్టికి సమస్యలు

ఈ పాఠశాలకు ఉపాధ్యాయులను సర్దుబాటు చేయడంతో పాటు యూపీస్కూల్‌గా ఆన్‌లైన్ చేయాలని పలుమార్లు స్థానిక ప్రజా ప్రతినిధులతో పాటు హెచ్ఎం కూడా అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఇటీవల నర్సీపట్నం సివిల్ జడ్జి పఠాన్ షియాజిఖాన్ ఆధ్వర్యంలో సరుగుడులో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన స్కూల్‌ను సందర్శించి సమస్యలు తెలుసుకున్నారు.

త్వరలో చర్యలు తీసుకుంటాం : ఎంఈవో

ఈ సందర్భంగా ఆయన ఆకస్మికంగా స్కూల్‌ను సందర్శించినపుడు జడ్జి దృష్టికి కూడా ఈ సమస్యను తీసుకెళ్లారు. దీనిపై నాతవరం ఇంఛార్జి ఎంఈవో సత్యనారాయణను సంప్రదించగా సరుగుడు యూపీ స్కూల్ ఆన్‌లైన్ సమస్య తన దృష్టికి వచ్చిందన్నారు. వెంటనే డీఈవో దృష్టిలో పెట్టానని త్వరలోనే ఆన్‌లైన్ చేసేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

ఐక్యంగా వర్గీకరణను అడ్డుకుంటాం


మాట్లాడుతున్న ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట కమిటీ మండల నాయకులు కాటపల్లి తదితరులు

దేవరాపల్లి : ఎస్సీలంతా ఐక్యమత్యంతో వర్గీకరణను అడ్డుకుంటామని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట కమిటీ మండల నాయకులు అన్నారు దేవరాపల్లిలో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట కమిటీ మండల నాయకులు సమావేశం మంగళవారం జరిగింది. ఈ సమావేశంలో కాటపల్లి అప్పారావు మాట్లాడుతూ ఇటీవల ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ధర్మాసనం ఇచ్చిన తీర్పును పునఃపరిశీలించాలని కోరారు. వర్గీకరణ పేరుతో ఎస్సీ ఉప కులాల మధ్య చిచ్చు పెట్టే విధానాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. దీనిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పునరాలోచన చేయాల్సి ఉందన్నారు. త్వరలోనే భవిష్యత్ కార్యాచరణను రూపొందించి ఎస్సీ ఉపకులాలంతా ఐక్యతగా పోరాడతామన్నారు. వర్గీకరణ విషయమై ఎంపీ, ఎమ్మెల్యేలు స్పందించాలని, ఎస్సీలకు అండగా నిలవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు పతివాడ నాగభూషణం, పరవాడ అప్పారావు, మచ్చ వీర్రాజు, సబ్బవరపు మాలిబాబు, టి. శ్రీరామ్, కార్లి సాయి సుందరరావు, కంచిమాల అప్పారావు పాల్గొన్నారు.

తాండవ గేటు ఐరన్ తాడును వెంటనే బాగు చేయాలి

నాతవరం : తాండవ రిజర్వాయరు ప్రధాన గేటు అపరేట్‌కు ఏర్పాటు చేసిన ఐరన్ తాడు తెగిపోవడంతో ప్రమాదం పొంచి ఉందని తాండవ ప్రాజెక్టు మాజీ చైర్మన్ పారుపల్లి కొండబాబు, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు కరక సత్యనారాయణ, టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు నందిపల్లి వెంకటరమణ అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో విలేకరులు సమావేశంలో వారు మాట్లాడారు. ప్రాజెక్టు అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రాజెక్టు ప్రధాన గేట్లు శిథిలావస్థకు చేరాయన్నారు. ఒకటో గేటుకు అమర్చిన ఐరన్ తాడు తెగిపోయిన ప్పటికీ అధికారులు పట్టించుకోకుండా జాప్యం చేయడం తగదన్నారు.ప్రస్తుతం రైతులంతా ఖరీఫ్ పంట సాగులో నిమగ్నమై ఉన్నారన్నారు. గేట్లు ఐరన్ తాడు మెయింటెనెన్స్ లేకనే తాడు తెగిపోయిందని, దానిని వెంటనే బాగు చేయాలన్నారు. లేకపోతే మిగతా గేట్లపై ఒత్తిడి పెరిగి అవి కూడా దెబ్బతినే అవకాశం ఉందన్నారు. శివారు ఆయకట్టుకు నీరు పుష్కలంగా అందేలా అధికారులు, సిబ్బంది కాలువల పర్యవేక్షణపై శ్రద్ధ చూపాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సన్యాసిదేముడు, మాజీ సర్పంచులు సూర్యారావు ఉన్నారు.

జీవో117 ను రద్దు చేయాలి

మాకవరపాలెం : జీవో 117 ను వెంటనే రద్దు చేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర నేత వెంకటపతిరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గాప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక ఉన్నత పాఠశాలలో మంగళవారం సాయంత్రం సభ్యత్వ నమోదును చేపట్టారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులతో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులంతా సమష్టిగా ఉంటే సమస్యలను పరిష్కరించుకోవచ్చన్నారు. అనంతరం ఉపాధ్యాయ సంఘ నేతలు సింగరాజు రామకృష్ణయ్య, గుల్లపిల్లి సింహాద్రప్పడుల వర్ధంతిని ఏపీటీఎఫ్ భవనంలో నిర్వహించారు. సంఘ నేతలు శ్రీరామ్మూర్తి, మల్లేశలింగం పాల్గొన్నారు.

రామకృష్ణయ్య, సింహాద్రప్పడుకు ఏపీటీఎఫ్ నేతల నివాళులు


రామకృష్ణయ్య, సింహాద్రప్పడు చిత్రపటాల వద్ద నివాళులు అర్పిస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

మాడుగుల రూరల్: ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ ఉద్యమ రథసారథులు కామ్రేడ్ సింగరాజు రామకృష్ణయ్య, ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఉద్యమ రూపశిల్పి కామ్రేడ్ గుల్లిపల్లి సింహాద్రప్పడు వర్ధంతి మంగళవారం మాడుగులలో నిర్వహించారు. స్థానిక ఏపీటీఎఫ్ మండల శాఖ అధ్వర్యంలో మాడుగుల హైస్కూల్లో ఆయా నేతల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మండల ఏపీటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.బంగారయ్య, జి. శివకుమార్, ఎస్.ఎన్.వి.డి. సూర్యనారాయణ, రొంగలి జగన్నాథరావు, మండల బాధ్యులు, కమిటీ సభ్యులు పాల్గొని వారి సేవలను కొనియాడారు.

పాఠశాలల అభివృద్ధికి సమష్టి కృషి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవోలు పడాల్‌దాస్, ఉషారాణి

దేవరాపల్లి : స్కూల్ యాజమాన్య కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు సమష్టిగా పాఠశాలల అభివృద్ధికి కృషి చేయాలని మండల విద్యాశాఖ అధికారి-1 బి.పడాల్‌దాస్, ఎంఈవో-2 వి.ఉషారాణి అన్నారు. ఈ మేరకు దేవరాపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్స్, నూతన ఎస్ఎంసీ కమిటీ చైర్మన్లు, సభ్యులతో సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఎస్ఎంసీ చైర్మన్లు, సభ్యుల ఆవశ్యకతను సమగ్రంగా వివరించారు.పాఠశాలలో ప్రతి బుధవారం, శుక్రవారం టాయిలెట్లకు ఫోటోలు తీసే విధానంపై సచివాలయ వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్లకు అవగాహన కల్పించారు.

చోడవరం రూరల్ : పాఠశాలల సమగ్ర అభివృద్ధికి, నాణ్యమైన విద్య కోసం పాఠశాల యాజమాన్య కమిటీలు కృషి చేయాలని మండల విద్యాధికారి కె.సింహాచలం కోరారు. మంగళవారం మండల విద్యాకేంద్రం అధ్వర్యంలో పాఠశాల యాజమాన్య కమిటీల చైర్మన్, వైస్ చైర్మన్లతో పాటు గ్రామ సచివాలయ సంక్షేమ సహాయకులకు ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ఎంఈవో అధ్యక్షత వహించగా శిక్షకులుగా ఐ.వి.రామిరెడ్డి, ఆర్.చిరంజీవి బాలికోన్నత పాఠశాల కమిటీ చైర్మన్ గుమ్మాళ సత్య వ్యవహరించారు. మధ్యాహ్న భోజన పథకం, మరుగుదొడ్ల నిర్వహణను పర్యవేక్షించాలని వారు తెలిపారు. యాజమాన్య కమిటీ సభ్యులు ప్రతి బుధవారం, శుక్రవారాల్లోను, సంక్షేమ సహాయకులు మంగళ, గురువారాలలో పాఠశాలలకు సంబంధించిన ఫోటోలను తప్పనిసరిగా యాప్‌లో అప్లోడ్ చేయాలని సూచించారు.

గ్రామసభలో తీర్మానించిన పనులు చేపట్టండి


సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎంపీడీవో హనుమంతరావు

నాతవరం : గ్రామసభలో సర్పంచుల అధ్యక్షతన తీర్మానించిన పనులకు వెంటనే అంచనాలు రూపొందించాలని ఎంపీడీవో హనుమంతరావు అన్నారు. ఆయన తన కార్యాలయంలో మంగళవారం సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 23న జరిగిన ఉపాధి హామీ పథకం గ్రామసభల్లో ప్రజా ప్రతినిధులు, ప్రజలు అమోదించిన పనులు సంయుక్తంగా పూర్తి చేయాలన్నారు. గతంలో వివిధ దశల్లో అసంపూర్తి నిర్మాణాలతో ఉన్న పనులను వేగవంతం చేయాలన్నారు. పారిశుధ్యం, డ్రైనేజీలు హౌసింగ్ తదితర పనులపై చర్చించారు. కార్యక్రమంలో పంచాయతీ విస్తరణాధికారి మూర్తి, హౌసింగ్ జేఈ జోగారావు పాల్గొన్నారు.

సాగు భూములను ఆన్‌లైన్ చేయాలి

మాడుగుల : సాగులో ఉన్న భూములను ఆన్‌లైన్ చేయకపోతే భూపోరాటం ఉధృతం చేస్తామని, సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు శంకరరావు అన్నారు. మండలంలో శంకరంలో సీపీఎం మండల కార్యదర్శి ఐరటా నరసింహమూర్తి అధ్యక్షతన జరిగిన మండల విస్తృత స్థాయి సమావేశంలో మాట్లాడారు మండలంలో ఉరలోవ కొండ చుట్టూ 450 మంది పేదలకు పట్టాలిచ్చారని, రైతులు పదేళ్ల నుంచి సాగులో ఉన్నా సరే వారి భూములు ఆన్‌లైన్ అవలేదన్నారు. సంబంధిత అధికారులు స్పందించి సాగులో ఉన్న పేదల భూములు ఆన్‌లైన్ చేయకపోతే ఉద్యమిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు, కె. భవాని, కె.దేవదాసు, మర్రి కృష్ణ, రవి కుమార్, మత్స్యరాజు, పాల్గొన్నారు.

పేదల ఇళ్లు తొలగించడం అన్యాయం

చోడవరం : పట్టణంలో గతంలో చేసిన ఆక్రమణలన్నీ తొలగించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రెడ్డిపల్లి అప్పలరాజు డిమాండ్ చేశారు. పట్టణంలో ఇటీవల రోడ్ల విస్తరణ, కాల్వల నిర్మాణం కోసం పలు ప్రాంతాల్లో పంచాయతీ ఆక్రమణలను తొలగింపు కార్యక్రమాన్ని చేపట్టిన విషయం తెలిసిందే. ఈ తొలగింపులో తమ ఇంటిని కూలవద్దంటూ నాగలక్ష్మి అనే మహిళ కుటుంబసభ్యులతో కలిసి పంచాయతీ కార్యాలయం వద్ద మంగళవారం నిరసన తెలిపారు. ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు రెడ్డిపల్లి అప్పలరాజు మరికొంతమంది ఈ నిరసనకు సీపీఐ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా అప్పలరాజు మాట్లాడుతూ పేదల ఇళ్లను ఆక్రమణల పేరుతో పంచాయతీ అధికారులు కక్షసాధింపుతో తొలగింపు చేయడం అన్యాయమన్నారు. పట్టణంలో గతంలో అనేక మంది పాత చెరువుతోపాటు పంచాయతీ స్థలాను చాలా మంది ఆక్రమించుకొని దుకాణాలు పెట్టుకున్నారని, వాటిని తొలగించకుండా పేదలు నివాసం ఉండడానికి కట్టుకున్న ఇళ్లను మాత్రమే కూల్చడానికి ప్రయత్నించడం సిగ్గుచేటన్నారు.

పశువులకు గాలికుంటు టీకాలు వేయించాలి


చౌడువాడలో టీకాలు కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్న దినేష్‌కుమార్

కె.కోటపాడు: పాడి పశువులు గాలికుంటు వ్యాధి బారిన పడకుండా టీకాయే రక్షణ కల్పిస్తుందని కె.కోటపాడు పశుసంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరక్టర్ దినేష్‌కుమార్ అన్నారు. మండలంలో జరుగుతున్న గాలికుంటు టీకాల కార్యక్రమాన్ని మంగళవారం ఎ.కోడూరు, వి.సంతపాలెం, చౌడువాడ, గుల్లేపల్లి, వారాడ గ్రామాల్లో ఆయన పరిశీలించారు. టీకాలు వేసిన పశువు వివరాలను నమోదు చేయాలని సూచించారు. కె.కోటపాడు, దేవరాపల్లి మండలాల్లో 38వేల పశువులకు గాలికుంటు టీకాలను సెప్టంబర్ 18లోగా వేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు ఆయన తెలిపారు. ఈ నెల 20 నుంచి ప్రారంభించిన కార్యక్రమంలో రెండు మండలాల్లో ఇప్పటి వరకు 5204 పశువులకు టీకాలు వేసినట్టు వెల్లడించారు. నాలుగు నెలలు దాటిన ప్రతి పశువుకు టీకా వేయాలని పశువైద్య సహయకులకు ఆయన సూచించారు. వ్యాధికి గురైన పశువులు తీవ్ర ఉష్ణోగ్రతతో కూడిన జ్వరంతో నీరసించి పోవడం, చూడి పశువులు ఈసుకుపోవడంతో పాటు ఎద్దుల్లో పని చేసే సామర్థ్యం తగ్గుతుందని అన్నారు. టీకాలు వేయడం వల్ల పశువు గాలికుంటు వ్యాధి బారిన పడినా పశువుల్లో పాల ఉత్పత్తి తగ్గదని, దూడల్లో మరణాలు జరగవని తెలిపారు. కార్యక్రమంలో పశువైద్య సహాయకులు సమీరా, సాయి, జగన్నాథం, లింగేశ్వరరావు, శివ, కాంపౌండర్ కనకారావు పాల్గొన్నారు.

చీడికాడ: మండలంలో గాలికుంటు వ్యాధి, బ్రూసెల్లోసిస్ వ్యాధి నివారణ టీకాల కార్యక్రమం మండలంలో చురుగ్గా సాగుతుంది. మంగళవారం డి.సురవరం శివారు కె.అగ్రహారం, ఎల్.బి.పట్నం, గ్రామాల్లో జరుగుతున్న టీకాల కార్యక్రమాన్ని మాడుగుల ఏరియా పశు వైద్యశాల సహాయ సంచాలకుడు డాక్టర్ వి.చిట్టినాయుడు తనిఖీ చేశారు. గ్రామంలో పాడి రైతులను కలిసి రైతు సేవా కేంద్రంలో అందుతున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. మండలంలో ఇప్పటి వరకు 4370 పశువులకు గాలికుంటు నిరోధక టీకాలు, 130 ఆడ పెయ్యిలుకు బ్రూసెల్లోసిస్ వ్యాధి నిరోధక టీకాలు వేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఖండివరం పశు వైద్యాధికారి డాక్టర్ గణేశ్, సహాయకులు శేషు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ముగిసిన శ్రీకృష్ణాష్టమి వేడుకలు

మాడుగుల రూరల్: శ్రీకృష్ణాష్టమి వేడుకలు సోమవారం రాత్రితో ఘనంగా ముగిసాయి. కె.జె.పురం రామాలయంలో గల ఉపాలయంలో శ్రీకృష్ణుడు ఆలయంలో సోమవారం రాత్రి భజన కార్యక్రమం నిర్వహించారు. ఆనంతరం ఉట్టి కొట్టే కార్యక్రమం ఏర్పాటు చేశారు. శ్రీకృష్ణుడి పవళింపు సేవ, కోలాటం నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

బాలకృష్ణునికి ఊయలసేవ

మాడుగుల : వేణుగోపాలస్వామి ఆలయంలో మంగళవారం రెండోరోజు శ్రీకృష్ణజన్మాష్టమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. చిన్నారులతో శ్రీకృష్ణ, గోపికల వేషధారణ చేయించి, ఉట్టి కొట్టించి, మహిళల కోలాటాలతో సంబరాలు చేసారు. అనంతరం చిన్నికృష్ణుని ఉయ్యాల సేవ నిర్వహించారు. ఆలయ అర్చక ప్రతినిధి వాడపల్లి శ్రీదేవి ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి.

గౌరీ పరమేశ్వరులను దర్శించుకున్న స్పీకర్


గౌరీ పరమేశ్వరులను దర్శించుకుంటున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

నర్సీపట్నం: మున్సిపాలిటీ గవరవీధిలో ప్రతిష్ఠించిన గౌరీ పరమేశ్వరులను మంగళవారం అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు జరిపించుకుని, తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఆయన వెంట మాజీ మంత్రి కిడారి శ్రావణ్ ఉన్నారు.

చర్చి నూతన కార్యవర్గం

నర్సీపట్నం : సెంటినరీ బాప్టిస్టు చర్చి నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. వైస్ ప్రెసిడెంట్ టి.గిరిజల్లా అధ్యక్షతన నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ప్రెసిడెంట్ నెల్లూరు రాజా నవీన్‌కుమార్, సెక్రటరీ పిల్లి దేవానంద్, ట్రెజర్లు నికోడమస్, సాల్మన్‌రాజు, వైస్ ప్రెసిడెంట్ నెల్లూరు వయోలా లిలియస్, జాయింట్ సెక్రటరీ దానం జేసుదాసు, తమలపాకుల జయరాణి, యూత్ కన్వీనర్ నెల్లూరు క్లారా డయానా, సండే స్కూల్ సూపరింటెండెంట్ గిరిజలతో పాటు మరో 12 మంది సభ్యులతో నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సీబీసీఎన్‌సీ సెక్రటరీ ఎ.డి.కె జాన్ నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలియజేశారు.

సత్యారావుకు మదర్ థెరిసా సేవా అవార్డు


అవార్డు అందుకుంటున్న సత్యారావు

బుచ్చెయ్యపేట: మండలంలో గల పొట్టిదొరపాలెం వీఎస్సార్ సేవా సంస్థ నిర్వాహకుడు ఒడ్డి సత్యారావు సంఘ సేవకురాలు మదర్ థెరిసా సేవా అవార్డు అందుకున్నారు. నిరుపేదలకు, రోడ్లపై తిరిగే బిచ్చగాళ్లకు, మంచానపడి లేచి నడవలేని వృద్ధులు, దివ్యాంగులకు అన్నదానంతో పాటు పలు సేవా కార్యక్రమాలు వీఎస్సార్ సంస్థ చేపడుతుంది. పలు వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి నిరుపేదలకు ఉచిత వైద్యసేవలు అందించడంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో అందిస్తున్న సేవలన విశాఖకు చెందిన లీడర్ సొసైటీ గుర్తించింది. సోమవారం సంఘ సేవకురాలు మదర్ థెరిసా జయంతి సందర్భంగా ఏటా అందించే సేవా అవార్డుకు సత్యారావును ఎంపిక చేశారు. పలువురు నాయకులు, సేవా సంస్థ నిర్వాహకుల చేతుల మీదుగా సత్యారావుకు ఉత్తమ సేవా అవార్డు అందించి అభినందించారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నాతవరం : స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్‌లో కొత్త ట్రాన్సుఫార్మర్ ఏర్పాటు చేసేందుకు పనులు చేస్తున్నందున ఈనెల 29వ తేదీన విద్యుత్ నిలుపుదల చేస్తున్నామని నర్సీపట్నం ఈఈ రామకృష్ణ తెలిపారు. గురువారం ఉదయం 9గంటల నుంచి ఒంటిగంట వరకు నాతవరం మర్రిపాలెం వెన్నలపాలెం డి.యర్రవరం, ములగపూడి, జిల్లేడుపూడి, లక్ష్మీపురం, చెర్లోపాలెం, వల్సంపేట, చమ్మచింత, మాధవనగరం, తాండవ గుమ్మడి గొండ తదితర గ్రామాలకు విద్యుత్ నిలుపుదల చేస్తున్నామని తెలిపారు.

మదర్ థెరిసాకు నివాళులు


జి.అగ్రహారం హైస్కూలు వద్ద విద్యార్థికి మిక్సర్ గ్రైండర్‌ను అందజేస్తున్న హెచ్ఎం తదితరులు

మాడుగుల రూరల్ : మండలంలో జి.అగ్రహారం జిల్లా పరిషత్ హైస్కూల్లో మదర్ థెరిసా 114 జయంతి కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. వడ్డాదికి చెందిన అతిథి దేవోభవ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మదర్ థెరిసా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సంస్థ ఆధ్వర్యంలో లాటరీ డ్రా తీసి మిక్సర్ గ్రైండర్‌ను ఈ పాఠశాల విద్యార్థి కె.సుమన్ (9వ తరగతి)కి పాఠశాల హెచ్ఎం ఉమాశంకర్, మాజీ సర్పంచ్ మాడ్సి లక్ష్మీ అప్పారావు చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి ఆరిపాక కామేశ్వరరావు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తాండవ గేటు ఐరన్ తాడు పరిశీలన

సాక్షి ఎఫెక్ట్..


తెగిపోయిన తాండవ ప్రధాన గేట్లు ఐరన్ తాడును పరిశీలిస్తున్న మెకానికల్ ఇంజనీర్

నాతవరం: తెగిపోయిన తాండవ ప్రధాన గేటు ఐరన్ తాడును సరి చేసేందుకు తాండవ ప్రాజెక్టు అధికారులు చర్యలు చేపట్టారు. తాండవ ప్రాజెక్టుకు పొంచి ఉన్న ముప్పు అనే శీర్షికతో వార్త మంగళవారం సాక్షిలో ప్రచురితమైంది. దీనిపై స్పందించిన తాండవ ప్రాజెక్టు అధికారులు విజయవాడకు చెందిన అనుభవం ఉన్న మెకానికల్ ఇంజినీర్ శరత్‌ను మంగళవారం రప్పించారు. తెగిపోయిన తాండవ ప్రధాన గేటు ఐరన్ తాడును స్వయంగా పరిశీలించారు. ప్రాజెక్టులో నీటి మట్టం ప్రమాద స్థాయిలో ఉన్నందున ఏవిధంగా మరమ్మతులు చేయాలనే విషయాలను క్షుణంగా పరిశీలించారు. ప్రధాన గేట్లు మరమ్మతులు చేసేందుకు కావలసిన మెటీరియల్ తాండవ రిజర్వాయరుపైకి తరలించే ఏర్పాట్లు చేయాలని ఆయన ప్రాజెక్టు అధికారులకు సూచించారు.